# పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి
- గుంజల్‌పహాడ్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే శంకర్


అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, జనవరి 28 : పౌష్టికాహారాన్ని తీసుకుంటేనే మహిళలు ఆరోగ్యంగా ఉంటారని జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. చౌదర్‌గూడ మండలం గుంజల్‌పహాడ్ గ్రామంలో జడ్పీ నిధులతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ఆదివారం ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. కుటుంబ అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించడంతో పాటు నేటి సమాజానికే ఆదర్శవంతులుగా నిలుస్తున్న మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలని, నాణ్యమైన భోజనాన్ని తీసుకోవాలని కోరారు. వైద్యుల సలహాలు సూచనలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. కిశోర బాలికలు, మహిళలకు అందించే పౌష్టికాహారాన్ని పొందాలని తెలిపారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలంటే మారుమూల పల్లెల్లో సామాన్య ప్రజలకు ఆరోగ్యాన్ని అందించే కేంద్రాలని అభిప్రాయపడ్డారు. అంగన్‌వాడీ కేంద్రాలు లేనిచోట్ల నూతనంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటానని, భవనాలను నిర్మించేందుకు నిధులను మంజూరు చేస్తామని ఆయన చెప్పారు. అనంతరం గ్రామంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, మండల నాయకులు పాల్గొన్నారు.


అమ్మవారికి బోనాలను సమర్పించడానికి ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు, యువతులు

# అంగరంగ వైభవంగా ఊరడమ్మ పండుగ


పెద్దేముల్, జనవరి 28 : మండల పరిధిలోని మంబాపూర్‌లో ఆదివారం గ్రామ దేవత ఊరడమ్మ పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ప్రజలందరూ ఉదయాన్నే స్నానాలాచరించారు. బంధుమిత్రులను ఆహ్వానించి పిండి వంటలు వండుకొని భోజనాలు చేశారు. సాయంత్రం గ్రామంలో అన్ని ఇండ్ల నుంచి మహిళలు, యువతులు పెద్దఎత్తున బోనాలు, నైవేద్యాలను తయారుచేసుకొని గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి ఊరడమ్మ అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతరాజు విన్యాసాలు, ఏర్పుసాని భవిష్యవాణి అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రజలు, బంధువులతో ఊరంతా సందడిగా మారింది.


ఊరడమ్మ జాతరలో పాల్గొన్న ప్రజలు, భక్తులు


జాతరలో పోతరాజులతో స్థానిక యువకుల ఉత్సాహం

# అవిశ్వాసం వైపు అడుగులు..

**ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసిన ఓ వర్గం కౌన్సిలర్లు**


ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసిన పలువురు పెద్దఅంబర్‌పేట కౌన్సిలర్లు

పెద్దఅంబర్‌పేట, జనవరి 28 : మున్సిపాలిటీలో అవిశ్వాసం వేడి మళ్లీ రాజుకుంటున్నది. పాలకవర్గం ఏర్పడి నాలుగేండ్లు పూర్తి చేసుకున్న మరుసటి రోజే అవిశ్వాసంపై చర్చకు తెరలేచింది. కాంగ్రెస్ పార్టీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం కోసం ఓ వర్గం కౌన్సిలర్లు ప్రయత్నాలు మొదలుపెట్టారు. పలు మున్సిపాలిటీల్లో అవిశ్వాసాలతో చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లను పక్కకు పెట్టడంతో పెద్దఅంబర్‌పేటలోనూ పీఠాలు దక్కించుకునేందుకు ఆశావహులు సిద్ధమవుతున్నారు. ఈమేరకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఆదివారం ఓ వర్గం కౌన్సిలర్లు కలిశారు. అవిశ్వాస తీర్మానం కోసం అనుమతి కోరారు. కానీ, ఇప్పుడే ఏం చెప్పలేనని, మరో రెండ్రోజులపాటు వేచి చూడాలని ఎమ్మెల్యే సూచించినట్టు సమాచారం.

### గతంలోనే క్యాంపులకు పయనం

మున్సిపాలిటీలో మొత్తం 24 వార్డులు ఉన్నాయి. నాలుగేండ్ల కిందట జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ 13 సీట్లు, టీఆర్‌ఎస్ 8, సీపీఐ, బీజేపీ, స్వతంత్ర అభ్యర్థి ఒక్కో సీటు గెలుచుకున్నారు. కానీ, కాంగ్రెస్‌లోని 13 మంది కౌన్సిలర్లు రెండు వర్గాలుగా విడిపోయారు. ఫలితంగా కాంగ్రెస్‌లోని ఓ వర్గం మద్దతు, ఇద్దరు ఎమ్మెల్సీల ఓట్లతో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ చెవుల స్వప్న చైర్‌పర్సన్ పదవిని కైవసం చేసుకున్నారు. బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల మద్దతుతో కాంగ్రెస్ కౌన్సిలర్ చామ సంపూర్ణారెడ్డి వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. పాలకవర్గం ఏర్పడిన నాటి నుంచే కాంగ్రెస్‌లోని రెండు వర్గాలు ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉన్నాయి. చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లపై అవిశ్వాసం కోసం గత ఏడాది జనవరిలోనే ఓ వర్గం కౌన్సిలర్లు గట్టిగా ప్రయత్నాలు చేశారు. క్యాంపులకు సైతం తరలివెళ్లారు. చైర్‌పర్సన్ పదవి కోసం పండుగల జయశ్రీ, వైస్ చైర్‌పర్సన్ పదవి కోసం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వరుసకు మేనల్లుడు అయిన చల్లూరి మురళీధర్‌రెడ్డి పోటీపడ్డారు. మరోవైపు, ఉన్న పదవులు చేజారిపోకుండా వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డి వర్గం సైతం క్యాంపులకు తరలివెళ్లింది. కొత్త పురపాలక చట్టం ప్రకారం.. నాలుగేండ్ల వరకు అవిశ్వాసానికి అవకాశం లేకపోవడంతో ఆ ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు చైర్‌పర్సన్ స్వప్నతోపాటు మరో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. దీంతో కాంగ్రెస్ బలం 15కు చేరింది.

### ఎవరు ఎటు వైపు..

మున్సిపాలిటీలో రాజకీయాలు ఎప్పటికప్పుడు మారుతున్నాయి. చైర్‌పర్సన్ స్వప్నపై ఎట్టి పరిస్థితిలోనూ అవిశ్వాసం ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ పార్టీలోని ఓ వర్గం కౌన్సిలర్లు పట్టుబడుతున్నట్టు తెలుస్తున్నది. ఇందుకు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల మద్దతు సైతం కూడగడుతున్నారు. వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డిపై అవిశ్వాసం విషయానికి వచ్చేసరికి కొందరు కౌన్సిలర్లు అటు ఇటుగా ఉన్నట్టు సమాచారం. వైస్ చైర్‌పర్సన్‌పై కాకుండా కేవలం చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని పలువురు కౌన్సిలర్లు అభిప్రాయపడుతున్నట్టు తెలుస్తున్నది. వైస్ చైర్‌పర్సన్ జోలికి పోతే మళ్లీ కథ మొదటికే వస్తుందని, అవిశ్వాసానికి ఆస్కారం ఉండబోదనే చర్చ కూడా నడుస్తున్నది. అందుకే చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు చాలామంది సానుకూలంగా ఉన్నట్టు సమాచారం. వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి సిద్ధమయితేనే.. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి మద్దతిస్తామని ఓ వర్గం కౌన్సిలర్లు తేల్చిచెప్తున్నట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో అవిశ్వాస అంశం రెండ్రోజుల్లో ఓ కొలిక్కి రానున్నది. ఇందుకు సానుకూల పవనాలు వీస్తే రెండు వర్గాలు మళ్లీ క్యాంపు రాజకీయాలకు తెరలేపేందుకు సిద్ధమవుతున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.


కమీషన్ ఏజెంట్లతో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ పద్మా హర్ష

# అధికారుల తప్పుంటే తప్పనిసరిగా చర్యలు

**మార్కెట్ కార్యదర్శి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి**

పరిగి, జనవరి 28 : పరిగి మార్కెట్‌లో వేరుశనగ రైతుల ఆందోళనకు సంబంధించి తమ శాఖ అధికారుల తప్పుంటే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి వెల్లడించారు. పరిగి మార్కెట్ కార్యదర్శి సుదర్శన్ పని తీరుపై డైరెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. చిన్న మార్కెట్‌లో, వారంలో ఒకే రోజు బీట్లు జరిగితే సరైన నిర్వహణ ఎందుకు లేదని మండిపడ్డారు. 'నీవు వచ్చి మా ఆఫీసులో కూర్చో, నేను ఇక్కడకు వచ్చి పని చేస్తానని' అన్నారు. రైతులు లేకుండా భూమిపై ఎవరూ లేరని చెప్పారు. వారు కడుపు మండి ఏదైనా చెబితే ముందు వినడం నేర్చుకోవాలని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

### పరిగి మార్కెట్‌ను సందర్శించిన డైరెక్టర్

మద్దతు ధర ఇవ్వాలంటూ పరిగిలో వేరుశనగ రైతులు జాతీయ రహదారిపై రాస్తారోకో చేసిన సంఘటనతో ఆదివారం మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి పరిగి మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ శాఖ అధికారులతో ఆమె ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి సమీక్షించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. డిమాండ్ తగ్గితేనే ధర తగ్గుతుందని, ప్రభుత్వం వేరుశనగ క్వింటాలుకు మద్దతు ధర రూ.6377 ప్రకటించిందన్నారు. మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేసినట్లయితే మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో వేరుశనగ కొనుగోలుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు కొంత ఎండబెట్టుకొని తీసుకురావడం ద్వారా మంచి ధర పొందవచ్చన్నారు. కమీషన్ ఏజెంట్లు తక్‌పట్టీలు ఇవ్వకపోవడంపై ఆమె స్పందిస్తూ తక్‌పట్టీలు ఇవ్వని అంశంపై వెంటనే పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా తక్‌పట్టీలు ఇస్తున్నారని మార్కెట్ కార్యదర్శి సుదర్శన్ చెప్పడంతో డైరెక్టర్ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్‌పట్టీలు ఇస్తే ఈ కాగితంపై ఎందుకు రాశారని మండిపడ్డారు. రైతులు ఆందోళన చేయకంటే ముందు మార్కెట్ కార్యదర్శికి వివరించగా ఎవరికి చెబుతారో చెప్పుకోండంటూ పేర్కొన్నారని తెలియడంతో ఆయనపై డైరెక్టర్ మండిపడ్డారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తామని ఆమె చెప్పారు.

### అవసరమైతే చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తాం

పరిగిలో ఒకే రోజు బీట్లు ఉండడం వల్ల ఒకేసారి అధిక మొత్తంలో వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్‌కు వస్తున్నాయని, రెండు రోజులు బీట్లు జరిపేలా ఆలోచిస్తామని డైరెక్టర్ పేర్కొన్నారు. ఉదయం 10 గంటల లోపు వచ్చిన వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి వెంటనే బీట్లు నిర్వహించి సాయంత్రం లోపు తూకం పూర్తయ్యేలా చూడాలని, మధ్యాహ్నం వచ్చిన వాటిని మరుసటి రోజు బీట్లు వేసేలా చూడాలన్నారు. అవసరమైతే చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తామన్నారు. మార్కెట్ యార్డులో వృథాగా పడివున్న వేయింగ్ మిషన్‌ను ఎందుకు మరమ్మతు చేయించలేదని కార్యదర్శిపై మండిపడ్డారు. రాత్రి సమయంలో మార్కెట్ యార్డులో లైట్లు వేయకపోవడంపై సెక్రెటరీని తప్పుపట్టారు. మీకు ఏమైనా కరెంటు బిల్లులు తక్కువగా ఇస్తున్నామా అని ప్రశ్నించారు. స్తంభాలకు వేసిన సీరీస్ బల్బులు ఎందుకు వెలగడం లేదని ప్రశ్నించారు. ఈ నామ్ విధానంపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కమీషన్ ఏజెంట్‌లు రూ.2 కంటే ఎక్కువ కమీషన్ తీసుకుంటే వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా డైరెక్టర్ ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు కొనుగోలుకు వచ్చేలా చూడాలన్నారు.

### లైసెన్స్ రద్దు చేయాలి

అంతకుముందు సమీక్ష జరిపిన డిప్యూటీ డైరెక్టర్ పద్మా హర్ష మార్కెట్ కమిటీ కార్యదర్శి సుదర్శన్ పని తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓపెన్ యాక్షన్‌కు ఎలా అనుమతి ఇచ్చావు, ఉన్నతాధికారుల అనుమతి తీసుకున్నావా అని మండిపడ్డారు. జీఎస్టీ చెల్లించకుండా, మార్కెట్ ఫీజు చెల్లించకుండా బుక్క చిట్టీలపై రాసివ్వడం ఎంత ధైర్యమని, మీరు ఎందుకు వారిపై చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తక్‌పట్టీ ఇవ్వకుండా తెల్ల కాగితంపై రాసిచ్చిన అంశంపై వెంటనే విచారణ జరిపి సంబంధిత కమీషన్ ఏజెంట్ లైసెన్స్ రద్దు చేయాలన్నారు.

### క్వింటాలుకు కిలో తరుగే తీయాలి

అనంతరం బీట్లు నిర్వహించగా వేరుశనగ క్వింటాలుకు గరిష్టంగా రూ.7150, కనిష్ఠంగా రూ.5వేల పైచిలుకు ధర పలికింది. ఈ సందర్భంగా కమీషన్ ఏజెంట్లు బస్తాకు కిలో పైగా తరుగు తీస్తున్నారని, క్వింటాలుకు నాలుగు కిలోల వరకు తరుగు తీస్తున్నట్లు రైతులు చెప్పడంతో డిప్యూటీ డైరెక్టర్ పద్మా హర్ష మార్కెట్‌లోని దుకాణాలను సందర్శించి కమీషన్ ఏజెంట్‌లతో మాట్లాడి క్వింటాలుకు కిలో తరుగే తీయాలని సూచించారు. ఈ మేరకు తూకాలు వేయాల్సిందిగా చెప్పారు. అనంతరం ఖరీదుదారులు, కమీషన్ ఏజెంట్‌లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ఇదే విషయం చెప్పడంతో వారు అంగీకరించి వేరుశనగ తూకాలు వేశారు. రైతులు లేవనెత్తిన అంశాలన్నింటినీ పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ రంగారెడ్డి జిల్లా మేనేజర్ ఛాయాదేవి, వికారాబాద్ జిల్లా అధికారి సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

**తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి

చేవెళ్లటౌన్, జనవరి 28 : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఆదివారం చేవెళ్లలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా కమిటీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఐదు సంవత్సరాలుగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు నిర్వహించలేదని.. వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

రాష్ట్ర కార్యదర్శి గాలయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా ఉపాధ్యాయ ఉద్యోగ విద్యారంగం సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చొరవ తీసుకొని, తక్షణమే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ మాట్లాడుతూ.. 317 జీవో ద్వారా నష్టపోయినవారికి స్థానిక జిల్లాల్లో సూపర్ న్యూమరీ పోస్టుల ద్వారా వారి ప్రజా ప్రతినిధుల సిఫారసులకు అనుగుణంగా రంగారెడ్డి జిల్లాకు అక్రమంగా వచ్చిన ఇతర జిల్లాల ఉపాధ్యాయులను తిరిగి తమ సొంత జిల్లాలకు పంపించాలని కోరారు.

కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కల్పన, ఆడిట్ కమిటీ చైర్మన్ రఘుపాల్, జిల్లా కార్యదర్శులు నాగేంద్రం, వెంకటయ్య, కిషన్ చౌహాన్, భీమ్‌రెడ్డి, భగవంతురాజ్, రామకృష్ణ, భువనేశ్వరి, శివారెడ్డి, నర్సింహులు, బుగ్గరాములు, గణేశ్ కుమార్, శ్యామలాదేవి ఉన్నారు.

# శిగమూగిన లష్కర్

**లష్కర్ వారానికి పోటెత్తిన భక్తజనం**

**మల్లన్నను దర్శించుకున్న 50 వేల మంది భక్తులు**

**ఉదయం 5గంటల నుంచే క్యూలైన్**

కొమురవెల్లి మల్లికార్జున స్వామి మూల విరాట్











చేర్యాల, జనవరి 28 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో రెండో ఆదివారం లష్కర్‌వారం సందర్భంగా మల్లన్న క్షేత్రానికి భక్తులు భారీగా తరలివచ్చారు. హైదరాబాద్‌తో పాటు కరీంనగర్, మెదక్, వరంగల్ ఉమ్మడి జిల్లాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మల్లన్న స్వామి మమ్మేలు అంటూ నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. శనివారం సాయంత్రం నుంచే ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో భక్తులు మల్లన్న క్షేత్రానికి చేరుకున్నారు. ఆలయ పరిధిలో దాతల గదులు ఖాళీగా లేకపోవడంతో ప్రైవేటు గదులు కిరాయికి తీసుకుని బస చేశారు. ఆదివారం వేకువ జామునే నిద్రలేచి కోనేటిలో స్నానాలు ఆచరించి క్యూలో వెళ్లి మల్లన్నస్వామిని దర్శించుకున్నారు. అభిషేకం, అర్చన, ఒడి బియ్యం, కొబ్బరికాయలు, పట్నాలు, బోనాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి 50వేల మంది భక్తులు వచ్చినట్లు ఆలయ ఈవో బాలాజీ తెలిపారు.


కొమురవెల్లి ఆలయ గంగరేగు చెట్టు వద్ద భక్తుల మొక్కులు

### వేకువజామునే ప్రారంభమైన దర్శనాలు

వేకువజామున 5 గంటల నుంచే స్వామివారిని దర్శించుకునేలా ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక దర్శనం, శీఘ్ర దర్శనం, ధర్మ దర్శనం తదితర కౌంటర్లను తెరిచి టిక్కెట్లను విక్రయించారు. అనంతరం గుట్టపై ఉన్న ఎల్లమ్మను దర్శించుకుని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్వాటకం లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు, ఏఈవో గంగా శ్రీనివాస్, సూపరింటెండెంట్ నీల శేఖర్, ఆలయ ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు, ఒగ్గు పూజారులు, సిబ్బంది భక్తులకు సేవలందించారు.


పట్నం వేసి మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు